క్లుప్తంగా

దుప్పట్ల అందజేత



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, దాత గోర్స జయ తదితరులు

ఆత్మకూరు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ముందస్తుగా వైఎస్సార్‌సీపీ మహిళా నేత గోర్స జయ ఆధ్వర్యంలో విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా పేద మహిళలకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. దివంగత వైఎస్సార్ స్ఫూర్తిగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి పుట్టిన రోజు త్వరలో జరగనుండడంతో పలువురు గిరిజన మహిళలకు దుప్పట్లు అందజేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు రగ్గులు, మందుల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలో స్థానిక పోలీసులు, దాతల సహకారంతో 120 మంది పేదలకు రగ్గులు, మందులు శుక్రవారం పంపిణీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన దాతలు ప్రకాష్‌జైన్, రమేష్ జైన్ తమ తండ్రి మన్‌మల్‌జైన్ జ్ఞాపకార్థం అందించిన రగ్గులు, స్థానిక డాక్టర్ చంద్రశేఖర్ సమకూర్చిన చవ్యన్‌ప్రాష్, ఆర్థో పెయిన్ రిలీఫ్ ఆయిల్, ఇతర మందులను పేదలకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై సుధాకర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ విజయ్ ప్రసాద్, సిబ్బంది, ఉపాధ్యాయులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను కారు ఢీకొని వ్యక్తికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

సంగం: బైక్‌ను కారు ఢీకొనడంతో ఒక వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని సిద్ధీపురం సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. నెల్లూరు వైపు వెళ్తున్న కారు సంగం వైపు వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే 108 వాహనం ద్వారా బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న మునిరత్నం

ఉదయగిరి: రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయ డీఆర్పీ మునిరత్నం తెలిపారు. ఆయన శుక్రవారం పట్టణంలోని రైతుభరోసా కేంద్రంలో క్షేత్ర స్థాయి సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయగిరి క్లస్టరు పరిధిలో ఇప్పటి వరకు 620 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తున్నారన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 1000 ఎకరాల్లో సాగు చేయించాలని లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఆశీర్వాదం, మండల యాంకర్ వెంకటలక్ష్మమ్మ, చందు, తదితరులు పాల్గొన్నారు.

సమృద్ధిగా యూరియా నిల్వలు



ఎరువులు దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

అనుమసముద్రంపేట: మండలంలోని రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు ఉన్నాయని వ్యవసాయశాఖ ఏడీఏ వీ దేవసేనమ్మ తెలిపారు. శుక్రవారం ఏఎస్‌పేట, హసనాపురంలో ఎరువుల దుకాణాలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రైవేట్ డీలర్ల వద్ద 146 టన్నులు, ఆర్బీకేల్లో 35 టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆమె వెంట ఏఎస్‌పేట వ్యవసాయధికారిణి టీ రజనీ, ఏఈఓ కె చిరంజీవి తదితరులు ఉన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- మత్స్యకారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- పోర్టులు, హార్బర్లతో తీర ప్రాంతాల అభివృద్ధి
- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



పాతపాళెంలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు

బిట్రగుంట: పేదల సంక్షేమమే ధ్యేయంగా దేశంలో ఎక్కడా లేని విధంగా వినూత్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు అమలు చేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ ముఖ్యమంత్రిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. చెన్నారాయునిపాళెం పంచాయతీ పాతపాళెంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఆఫ్కాప్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబుతో కలిసి ఎంపీ బీద మస్తాన్‌రావు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ, ఆఫ్కాప్ చైర్మన్ ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని సమగ్రంగా వివరించే బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రధానంగా తీరప్రాంత గ్రామాలు, మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్ చేశారని వివరించారు. పోర్టులు, హార్బర్‌ల ద్వారా మత్స్యకారులకు స్థిరమైన ప్రగతిని, ఆర్థిక వనరులు అందించేందుకు రాష్ట్రంలో శరవేగంగా పోర్టులు, హార్బర్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రారంభానికి సిద్ధమవుతున్న రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లే ఇందుకు నిదర్శనమన్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చో బెట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

తీరప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

- ఎమ్మెల్యే రామిరెడి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రంలోని తీర ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా మత్స్యకారులకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అన్నారు. కావలి నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాలను, ప్రజలను సుసంపన్నం చేసే దిశగా రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లను శరవేగంగా పూర్తి చేయడమే అందుకు నిదర్శనమన్నారు. హార్బర్, పోర్టులతో పాటు మత్స్యకారులకు వేట నిషేధం సమయంలో ఇచ్చే రూ.4 వేల పరిహారాన్ని రూ.10 వేలకు పెంచారని, రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించారని, సబ్సిడీపై పెద్ద సంఖ్యలో పడవలు, ఐస్‌బాక్స్‌లతో కూడిన మోటారుసైకిళ్లు కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకార మహిళలకు చేయూత, భరోసా, రుణాల రూపంలో భారీగా నిధులు అందించినట్లు వివరించారు. ఒక్క పాతపాళెం గ్రామంలోనే సంక్షేమ పథకాల రూపంలో సుమారు రూ.7 కోట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. అనంతరం గ్రామంలో రూ.15 లక్షలతో పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, సర్పంచ్ కొండూరు గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, వైఎస్సార్‌సీపీ మండల యువత అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మత్స్యకార గ్రామాల కాపులు తదితరులు పాల్గొన్నారు.

మోసానికి మారుపేరు చంద్రబాబు



పింఛన్ నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

- మాట తప్పని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: మోసానికి మారు పేరు చంద్రబాబు అయితే, మాట తప్పని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో అవ్వాతాతలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలకు పెంచి మాట తప్పని నాయకుడిగా ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 95 శాతం పైగా అమలు చేశారన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ రూ.1,000 ఇచ్చే వారని కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.3 వేలకు పెంచామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సొమ్మంతా నీరు–చెట్టు పేరుతో ఆ పార్టీ నేతల జేబుల్లోకి వెళ్లిందన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజలు నమ్మొద్దన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా ఉండాలన్నారు. 34 సంక్షేమ పథకాలు అమలు చేస్తూ బడుగు, బలహీన వర్గాల వారికి ప్రభుత్వం అండగా ఉన్నారన్నారు. టీడీపీ పార్టీని బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు.

అల్లూరు మండలానికే రూ.400 కోట్లు

వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఒక్క అల్లూరు మండలానికే రూ.400 కోట్ల ఖర్చు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. మండలంలో ఈ నెల నుంచి కొత్తగా 225 మందికి పింఛన్లు మంజూరు చేశారన్నారు. మండలంలో మొత్తం దాదాపు 7,300 మందికి పింఛన్లను ఇస్తున్నారన్నారు. పింఛన్లు తీసుకునే ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి జగనన్నను గుర్తు పెట్టుకుని 2024లో ముఖ్యమంత్రిగా రెండో సారి గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫ్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, ఎంపీపీ శశిరేఖ, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ జ్యోతి, కమిషనర్ ఫణికుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, రూరల్ అధ్యక్షుడు బీద రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

ఉదయగిరి: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు మార్చి 31లోపు నూరు శాతం పన్నులు వసూలు చేయాలని ఈఓపీఆర్డీ ఎస్ మల్లికార్జున శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటి పన్నులు చెల్లించే వారు ఫోన్‌పే, ఆన్‌లైన్, స్కాన్ ద్వారా మాత్రమే నగదు చెల్లించాల్సి ఉందన్నారు. మండలంలోని తిరుమలాపురం, ఆర్లపడియ, కృష్ణంపల్లి, శకునాలపల్లెలో రీసర్వే జరుగుతుందని, గృహాల యజమానులు సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యదర్శులు పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

10 నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్

సోమశిల: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్‌సీపీ నేత బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి సహకారంతో జాలీబాయ్స్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ఈ టోర్నీ మొత్తానికి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9347337500, 9951215937 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వనమ్మ కుటుంబానికి జానీ మాస్టర్ ఆర్థిక సహాయం



వనమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న జానీ మాస్టర్

సంగం: సినీ కొరియో గ్రాఫర్ జానీ మాస్టర్ మండలంలోని తుణవాయి దాసరపాళెంకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త వనమ్మ కుటుంబ సభ్యులకు శుక్రవారం రాత్రి రూ.70 వేలు నగదు సహాయాన్ని అందజేశారు. వనమ్మ మృతి చెందిన విషయాన్ని పలు ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న జానీ మాస్టర్ ఆమె కుటుంబ పరిస్థితులను తెలుసుకుని బుధవారం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తానని ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి గ్రామానికి చేరుకున్న జానీ మాస్టర్ వనమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలి

ఉదయగిరి: ఈ నెల 10 నుంచి 23వ తేదీ వరకు మండల స్థాయిలో నిర్వహించే ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ డీ.ఈశ్వరమ్మ కోరారు. ఆమె శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో జరిగిన క్రీడా పోటీల్లో విజేతలైన క్రీడాకారులు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈనెల 19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ నేపథ్యంలో 11న నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయం అనే అంశంపై 12–15, 16– 18 ఏళ్ల విభాగాల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు జరుగు తాయన్నారు. పోటీలో విజేతలైన వారికి రూ.లక్ష ప్రైజ్‌మనీ ఇస్తారన్నారు. రిజిస్ట్రేషన్ అవసరం లేదని, ఆసక్తి ఉన్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

ప్రతి రైతుకు అండగా ఆర్బీకేలు

- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల: విత్తనం నుంచి విక్రయాల దాకా రైతన్నకు అండగా రైతు భరోసా కేంద్రాలు నిలుస్తున్నాయని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేజర్లలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలోనే మరెక్కడా లేని రీతిలో సాగు ఉత్పాదకాలను రైతు ముంగిటకు తీసుకెళ్లాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి సచివాలయాలకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న ఆర్బీకేలు రైతులకెంతగానో సేవలందిస్తున్నాయన్నారు.

ప్రతి ఇంటికి తాగునీరు

చేజర్లలో జలజీవన్ పథకం ద్వారా రూ.88.60 లక్షల వ్యయంతో ప్రతి ఇంటికి తాగు నీరు అందించే జలజీవన్ పథకానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ శివనాయక్, ఎం. శశిధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణ, సొసైటీ అధ్యక్షుడు వీరరాఘవ రెడ్డి, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

– డిప్యూటీ డీఈఓ రఘురామయ్య



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రఘురామయ్య

సోమశిల: త్వరలో జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను డిప్యూటీ డీఈఓ రఘురామయ్య ఆదేశించారు. మండలంలోని సోమశిల, ఉప్పలపాడు, జంగాల ఉన్నత పాఠశాలలను, గిరిజన పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. 60 రోజుల కార్యక్రమంపై విద్యార్థులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–1 బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో సమీక్ష

మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం డిప్యూటీ డీఈఓ రఘురామయ్య ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల సామర్థ్యాలపై చర్చించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్య అక్షతలు

ఉదయగిరి: పట్టణంలోని బాలాజీనగర్‌లో రామ జన్మ భూమి ట్రస్ట్ నుంచి వచ్చిన అక్షతలను శుక్రవారం రామసేవకులు ఇంటింటా పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరగనుంది. ఈ క్రమంలో ఈనెల 15వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో అక్షతలు, కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ప్రతిష్ఠా మహోత్సవం రోజున స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం వేళ దీపాలు వెలిగించాలన్నారు.



ఆత్మకూరులో రైతులకు పూడిక తీత పనులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

రైతులకు చెక్కు అందజేత

ఆత్మకూరు: రైతులు బాగుంటే రాష్ట్రం బాగుంటుందనే ఆశయంతో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పలు పంట కాలువల పూడికతీత పనులకు సొంత నిధులు అందించారు. మండలంలోని అప్పారావుపాళెం, బట్టేపాడు పరిధిలోని సుమారు వెయ్యి ఎకరాలకుపైగా సాగునీరందించే ఏటికాలువ పూడికతో నిండిపోయి ఉండడంతో ఆ పూడిక పనుల కోసం తన సొంత నిధులు రూ.1.25 లక్షల చెక్కును ఎమ్మెల్యే ఆ గ్రామ రైతులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు.

భూ హక్కు పత్రాల అందజేత

జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రీసర్వే పూర్తయిన నువ్వూరుపాడు రెవెన్యూ పరిధిలోని పలువురు యజమానులకు రైతులకు హక్కు పత్రాలను ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి అందజేశారు. ఇటీవల ఆడుదాం ఆంధ్రలో పాల్గొన్న గ్రామాలకు చెందిన యువకులు మండల స్థాయికి తమ ప్రతిభను కనబరచడంతో వారిని ప్రోత్సాహించేందుకు ఆయన క్రికెట్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కురబ మధులత, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు, ఎంఈఓ షేక్ నజీర్‌బాషా, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, సొసైటీల అధ్యక్షుడు సానా వేణుగోపాల్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, ఐవీ రమణారెడ్డి, కౌన్సిలర్లు రమాదేవి, తిరుపతమ్మ, మహబూబ్‌బాషా, గంధళ్ల వేణు, నందవరం ప్రసాద్, రహీం, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, జమీర్, కలాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలే సారథులు

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



పెంచిన నూతన పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి

చేజర్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలోని సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు సారథులుగా నిలవాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు ఉత్సవాల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పలువురికి పింఛన్ కానుకను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి సంక్షేమ పథకాన్ని రాష్ట్రంలోని ప్రజలందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. తాను అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా చూసేందుకు ప్రజా ప్రతినిధులను ప్రతి గడపకు పంపి వారి సమస్యను పరిష్కరించే విధంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ కార్యాచరణ రూపొందించారన్నారు. ఈ సందర్భంగా తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన అభివృద్ధి నిధులు మంజూరు చేశారన్నారు. నవరత్నాల పథకాలకు సంబంధించి చిన్న చిన్న కారణాలతో సంక్షేమ పథకాలు రాని వారి కోసం ఏడాదిలో రెండు సార్లు నగదును లబ్ధిదారులకు అందజేస్తున్నారు. సంక్షేమ పథకాలు మీ ఇంటికే చేరవేసేందుకు మీ సమస్యలను మీ గ్రామాల్లో పరిష్కరించుకునేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ వలంటీర్ల వ్యవస్థపై ప్రతి పక్షాలు బురద చల్లే విధంగా మాట్లాడుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందుకునే ప్రతి ఒక్కరు మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేలా కష్టపడాలని కోరారు. 175కు175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పి.బాలంగాధర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బూదళ్ల వీరరాఘవరెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, కొమ్మి సిద్దులనాయుడు, మైనార్టీ నేత షేక్ సిరాజుద్దీన్, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులు నాయుడు, చేజర్ల సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు ఎంపీపీ వేణుగోపాల్ రెడ్డి ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, తహసీల్దార్ కృష్ణ, ఏపీఎం సుజన తదితరులు పాల్గొన్నారు.

స్కాన్ సెంటర్ల పరిశీలన



అభిరామ్ ఆస్పత్రిలోని స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైద్యశాఖాధికారులు

ఆత్మకూరు: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పెంచలయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాల్లో శుక్రవారం ఆరోగ్య శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీసీపీఎన్‌డీటీ అధికారులు, డీఈఎంఓ శ్రీనివాసరావు, బి శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈఎంఓ కనకరత్నం డాక్టర్ బీఎస్సార్ ఆస్పత్రి, అభిరామ్, కేకేఆర్, నిత్యా డయోగ్నోస్టిక్స్, క్లియర్ స్కాన్, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రుల్లోని స్కానింగ్ కేంద్రాల్లో ఈ తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. ఆస్పత్రుల్లో సేవలకు, ఓపీలకు వసూలు చేసే చార్జీలకు బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. గర్భిణులకు నిర్వహించే పరీక్షల వివరాలను నమోదు చేయాలని సూచించారు. వారి వెంట ఆయా ఆస్పత్రుల వైద్యులు ఉషాసుందరి, మేకపాటి దీప్తి, డాక్టర్ శివశంకర్, సుధాకర్‌రెడ్డి, అరుణమ్మ, తదితరులు ఉన్నారు.

రాత్రి వేళ రహదారి టెర్రర్



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



ఘటనా స్థలంలో సహాయక చర్యల్లో పోలీసులు, స్థానికులు

- గేదెను ఢీకొని ఓ కారు బోల్తా
- మరో కారు అదుపుతప్పి వ్యాన్‌ను ఢీకొన్న వైనం
- ముగ్గురికి తీవ్రగాయాలు

మర్రిపాడు: రాత్రి వేళ చీకట్లో రోడ్డు దాటుతున్న గేదెను గుర్తించలేక ఓ కారు ఢీకొని పక్కకు ఒరిగిపోయింది. రోడ్డుపై పడిన గేదెనుఅదే సమయంలో వచ్చిన మరో కారు ఢీకొని అదుపు తప్పి.. ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరితో పాటు డీసీఎం డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని నందవరం సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. మర్రిపాడు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న ఓ కారు నందవరం సమీపానికి వచ్చే సరికి రోడ్డుపై ఓ గేదె అడ్డురావడంతో ఢీకొంది. ఆ కారు రోడ్డు పక్కకు దూసుకుపోయింది. గేదె రోడ్డుపైనే పడిపోయింది. అదే సమయంలో పొంగూరు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న మరో కారు రోడ్డుపై అడ్డంగా పడిపోయిన గేదెను చీకట్లో గుర్తించలే ఢీకొట్టింది. వేగాన్ని నియంత్రించలేక ఎదురుగా కడప నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ఓ డీసీఎం లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నెల్లూరుకు చెందిన ప్రసాద్‌తో పాటు అతని భార్యకు, లారీడ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మర్రిపాడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రోడ్డుపై పడి ఉన్న గేదెను పక్కకు తొలగించారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మెట్టుకూరు చిరంజీవిరెడ్డి

కలిగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి ప్రత్యేక దృష్టి పెట్టారని ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి తెలిపారు. అనంతపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు పొందడం పేదలకు వరమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. 210 మంది రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీష, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, వైద్యాధికారులు గీతారెడ్డి, మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.